ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
ఆదివారం 1 డిసెంబరు 2024



దశాబ్దాలుగా సాగు..
అయినా
పట్టాలు కరువు
ఎన్నికల వేళ
నేతల హామీలు
అమల్లో మాత్రం
శూన్యం
సమస్యల్లో 10లక్షల
మంది రైతులు
1980 నాటి నుంచి
ఇదే తీరు...

బగర్ హుకుం హక్కులకు



ఇంకెన్నాళ్లు..?

బెంగళూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీలుగా కొన సాగుతున్న భూములులేనివారికి జీవనోపాధి కోసం రెండు ఎకరాల భూమి మంజూరు చేసేలా బగర్‌హుకుం చట్టం తీసుకొచ్చారు. 1980లో ఈ చట్టం అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత కూడా రైతులు తమకు అను కూలమైన ప్రదేశంలో జీవనంకోసం భూమిని సాగు చేసుకుంటూ కుటుం బాలను పోషించుకుంటూ వచ్చారు. ఇటువంటి రైతులకు భూమి హక్కులు కల్పించడమే బగర్‌హుకుం విధానం. ప్రభుత్వభూమిని చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం హక్కుపత్రాలను మంజూరు చేసేలా భూసంస్కరణ చట్టాన్ని తీసుకొచ్చినా పలు సాంకేతిక సమస్యలతో రైతు లను భూ యజమానులుగా మార్చే ప్రక్రియ సాధ్యం కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం బగర్‌హుకుం (బంజరు) భూములను సాగు చేసే రైతులకు హక్కులు కల్పించాలని నాలుగు దశాబ్దాలుగా సూచిస్తోంది. ప్రభుత్వం ఏదైనా ముఖ్యమంత్రి, రెవెన్యూమంత్రి హోదాలో కొనసాగే ప్రతిఒక్కరూ బగర్‌హుకుం భూములకు హక్కులు కల్పిస్తామని భరోసా ఇస్తున్నారు. కానీ ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. అధికారులకు గడువులు వాయిదాలు పడుతున్నాయిగానీ పట్టాలు ఇచ్చింది మాత్రం లేదు. బగర్ హుకుం కమిటీలు రైతులకు న్యాయం చేసే విషయంలో పూర్తిగా విఫల మయ్యాయి. సాగు చేస్తున్న భూములకు హక్కుపత్రాలకోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈ ఏడాది ఆఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ ఆదేశాలు అమలు అసాధ్యమనిపి స్తోంది. మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన తర్వాత కూడా లక్షలాది పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. దశాబ్దాలుగా సాధ్యం కాని పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ మరో నెల రోజుల్లో పూర్తి అవుతాయని చెప్పడం అసాధ్యం. పైగా మరో వారం రోజుల తర్వాత శాసనసభ శీతాకాల సమా వేశాలు బెళగావిలో జరుగనున్నాయి. రెండువారాలపాటు సమావేశాలు ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగమంతా బెళగావిలోనే గడుపుతారు. కీలక మైన రెవెన్యూశాఖ అధికారులు శాసనసభ సమావేశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. భూ సంస్కరణ చట్టం ప్రకారం రెవెన్యూశాఖ పరిధి లోని భూములకు మాత్రమే పట్టాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. అటవీభూమి, కొండప్రాంతాలు, కుమ్కీ, ఇతరత్రా భూములకు రెవెన్యూ శాఖ హక్కుపత్రాలు ఇచ్చేందుకు వీలుండదు. తరతరాలుగా అటవీప్రాం తాలు, కుమ్కీ ఇతరత్రా భూములు సాగు చేస్తున్నవారి పరిస్థితి అగమ్య గోచరంగా మారుతోంది. రైతులు సాగు చేస్తున్న భూముల్లో 50శాతం ఇటువంటి వివాదాస్పదమైనవే ఉన్నాయి. అర్జీలను తిరస్కరిస్తే సాగు చేయకుండా అడ్డుకోవాల్సి ఉంటుంది. అయితే రెండు మూడు తరాలుగా భూమిని నమ్ముకుని పంటలసాగుతో జీవనం సాగు చేస్తున్నవారిని ఒక్కసారిగా వదలమంటే అదో పెద్ద వివాదమే అవుతుంది. ఇలా భూములు సాగు చేస్తున్నవారంతా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. పశ్చిమ కనుమలతోపాటు ఇతరత్రా అటవీప్రాంతాలకు అనుబంధంగా ఉండే భూములలో సాగు చేసేవారికి అటవీశాఖ నుంచి హక్కులు కల్పించడం అసాధ్యం. అలాగని భూములను వదులుకోమని చెప్పే పరిస్థితి కూడా లేదు. భూ సంస్కరణ చట్టం ప్రకారం 2015 నాటికి 15ఏళ్ల వెనుక నుంచి బగర్‌హుకుం సాగు చేసే వారికి మాత్రమే హక్కుప త్రాలు ఇచ్చేందుకు వీలుంటుంది. కర్ణాటక స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేష న్ సెంటర్ (కేఎస్ఆర్ఎస్ఏసి) ఉపగ్రహ ఆధారిత యాప్ సిద్ధం చేశారు. ఎన్నేళ్లుగా సదరు భూమి సాగులో ఉందనేది నిర్ధారించి హక్కుపత్రాలు ఇవ్వదలిచారు.

నమూనా	అర్జీలు	సక్రమ	తిరస్కరించినవి	విభజన జరిగినవి	పెండింగ్
50	11,57,516	3,87,520	7,64,541	11,52,061	5455
53	11,41,228	2,19,604	8,18,019	10,37,623	1,03,605
57	10,69,990	8,733	1,63,384	17,017	8,97,973

పరిష్కారాలు

కేంద్రప్రభుత్వం 1980లో అటవీ సంరక్షణా చట్టాన్ని రాష్ట్రంలోనూ అమలు చేయడం ద్వారా సొప్పినబెట్టి (గోమాళ), కుమ్కీతోపాటు సాగు చేస్తున్న భూమికి అనుబంధంగా ఉన్న మెట్ట భూములు, చెరువులు, కాలువలు, ఇతరత్రా అనుబంధ భూములు సాగు చేసేవారికి అటవీభూమిగా బదిలీ చేసి పట్టాలు మంజూరు చేయవచ్చు. ప్రతి జిల్లాకు ఓ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పర్యవేక్షణలో గడువులోగా పరిష్కారం చూపవచ్చు. ప్రతి జిల్లాకు కంట్రాక్టు పద్ధతిన 20మందికిపైగా సర్వేయర్‌లను నియమించి ఏకకాలంలో సర్వే ప్రక్రియ ముగించవచ్చు.

వివాదాలు

ఒకే వ్యక్తి వివిధ తాలూకాలు, జిల్లాల్లో పదులసం ఖ్యలో దరఖాస్తులు చేసినట్లు తెలుస్తోంది. భూములు ఉన్న వారు సైతం పిల్లలు, అన్నద మ్ములు, అక్కచెల్లెళ్ల పేరిట దరఖాస్తులు చేశారు. సాగు చేయకపోయినా జిల్లాతో సంబంధం లేకున్నా దరఖాస్తులు చేశారు. 54లక్షల ఎకరాల భూమి కోసం దరఖాస్తులు చేసు కున్నారు. వాస్తవానికి అంత విస్తీర్ణం భూమి లేదు.

బగర్ హుకుం అంటే..



బగర్‌హుకుం అంటే 1980కు ముందు భూమిలేని రైతుల కుటుంబాలకు జీవనం కోసం రెండు ఎకరాల భూమిని మంజూరు చేసే చట్టం తీసుకొచ్చారు. ఆ తర్వాత కూడా రైతులు తమకు అనుకూలంగాను కొన్ని చోట్ల కుటుంబాల పోషణకోసం భూమి ఏదైనా అడిగేవారు లేదంటే సాగు చేసే ప్రక్రియను ప్రారంభించారు. దశాబ్దాలుగా వాటినే బగర్‌హుకుంగా పిలుస్తారు. అయితే దశాబ్దాలకాలంగా సమస్యను పరిష్కరించకపోవడంతోనే ప్రస్తుతం లక్షలాదిమంది రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. నమూనా 50, 53, 57 ప్రకారం అక్రమ భూమిని సక్రమం చేసుకునేందుకు దరఖాస్తులు అందించారు. ఇప్పటికే పలు జిల్లాల్లో సమర్పించినవి సక్రమ కింద పరిష్కరించగా మరికొన్ని తిరస్కరించబడగా కొన్ని శాఖల వారీగా విభజన జరిగాయి, మరికొన్ని పరిష్కారం కోసం పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా 10లక్షలకుపైగా అర్జీలు పరిష్కారానికి ఎదురుచూస్తున్నాయి.

రైతులు సాగు చేస్తున్న భూములు రెవెన్యూ, అటవీశాఖకు చెందినదా అనేది అధికారులవద్దనే స్పష్టత లేదు. జాయింట్ సర్వే మినహా సాగు చేస్తున్న భూమికి హక్కులు కల్పించడం సాధ్యం కాదనే అభిప్రాయాలు ఉన్నాయి. సర్వేలు చేయించేందుకు రెవెన్యూశాఖలో సర్వేయర్‌ల కొరత వెంటాడుతోంది. ప్రతి తాలూకాలోనూ వేలకొలదీ అర్జీలు సర్వేకు పెండింగ్‌లో ఉన్నాయి.



చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ శోభారాణి

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు

ఘనస్వాగతం

బళ్లారి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు బళ్లారిలో ఘనస్వాగతం పలికారు. శనివారం బళ్లారి జిందాల్ ఎయిర్ పోర్టులో బళ్లారి ఎస్పీ శోభారాణి ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామంలో పింఛన్ల పంపిణీ, ప్రజా వేదిక కార్యక్ర మాల్లో పాల్గొనడానికి సీఎం చంద్రబాబు వచ్చారు. విజయవాడ నుంచి నేరుగా ఆయన జిందాల్ ఎయిర్ పోర్టుకు ప్రత్యేక విమానంలో వచ్చారు. జిందాల్‌లో దిగి హెలికాప్టర్లో నేమకల్లుకు బయలు దేరారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో జిందాల్ ఎయిర్ పోర్టులో ఎస్‌జీపీ, ఎన్ఎస్‌జీ భద్రతా బలగాలతో పాటు పోలీస్ బలగాలు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయనను పలకరించాలని జిల్లాలోని పలువురు టీడీపీ అభిమానులు ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లో ఎదురు చూశారు. అయితే భద్రతా దళాలు అనుమతివ్వకపోవడంతో అభిమానులకు నిరాశే మిగిలింది. దీంతో టీడీపీ అభిమానులు వెనుదిరిగారు.

కార్యకర్తల ఒత్తిడితోనే నిఖిల్ పోటీ

- ప్రజాభిమానాన్ని మరువలేం: కేంద్ర మంత్రి కుమార స్వామి



మాట్లాడుతున్న కుమారస్వామి

బెంగళూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల ఒత్తిడితోనే చన్నపట్టణలో నిఖిల్‌ను బరిలోకి దింపాల్సి వచ్చిందని కేంద్ర మంత్రి కుమార స్వామి పేర్కొన్నారు. శనివారం రామనగరలో చన్నపట్టణ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవె గౌడ కుటుంబం పోరాటంలో వెనుకడుగు వేసేది లేదన్నా రు. స్థానిక కార్యకర్తలు నిఖిల్ మాత్రమే పోటీ చేయాలని ఒత్తిడి తీసుకురావడంతో నామినేషన్‌ల చివరి రోజుకు ఒకరోజు ముందు అభ్యర్థిగా నిర్ణయించామన్నారు. చన్నపట్టణ కాంగ్రెస్ నేతలకు మేమింకా బతికే ఉన్నామనే రీతిలో అభిమానం చూపా రన్నారు. మైత్రి అభ్యర్థి గెలుపు ఓటములకంటే మీ అభిమానం ముఖ్య మన్నారు. ఓటమిపై ఆత్మావలోకనం అంటే బాధ్యత నేను వహించాల్సి ఉంటుందన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో మండ్య నుంచి నిఖిల్ పోటీ చేయాలని ఒత్తిడి ఉండేదన్నారు. నిఖిల్‌కు అధికార దాహం ఉంటే అప్పుడే పోటీకి సై అనేవారన్నారు. 1967 నుంచి దేవెగౌడ రాజకీయాల్లో ఉన్నారని ఎవరెంత గాండ్రించినా దేవుడు, ప్రజల ఆశీస్సులు తమకే ఉన్నాయన్నారు. తనను టూరింగ్ టాకీస్ అన్నారని, పలు కారణాలతో నియోజకవర్గాలు మారానన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా పోటీ చేసే సత్తా దేవెగౌడ కుటుంబానికి మాత్రమే ఉందన్నారు. నిఖిల్ పోటీ చేసే అంశం నిర్ణయించుకుని ఉంటే తాను మండ్య నుంచి ఎంపీగా గెలిచిన వెంటనే ఏర్పాట్లు చేసుకునేవారన్నారు. కానీ అలా జరగలేదన్నారు. శుక్రవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని సీఎం సిద్దరామయ్య కలసి బయ టకు వచ్చిన వెంటనే తమ కుటుంబాన్ని స్మరించుకున్నారన్నారు. నిఖిల్ మాట్లాడుతూ ఓడానని వెనుకడుగు వేసేది లేదన్నారు. తాను ఓడి వారం రోజులు అవుతోందని, నాకింకా 36ఏళ్లు అని, తన ముందున్న సవాల్ జేడీ ఎస్ పార్టీని బలోపేతం చేయడమేనన్నారు.



విధానసౌధ వద్ద కళాబృందాల సందడి

అలరించిన నమ్మ జాతర

బెంగళూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కన్నడ సంస్కృతిశాఖ ఏర్పాటు చేసిన 'నమ్మ జాతర' అలరించింది. విధానసౌధ తూర్పు ద్వారం వద్ద శనివారం రాత్రి వివిధ జానపద బృందాలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీఎం సిద్దరామయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీసీఎం డీకే శివకుమార్, కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడగి, మంత్రి జమీర్ అహ్మద్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. కళాబృందాలతో కలసి సీఎం, డీసీఎంలు తాళం వేశారు. డొళ్ళుకుణిత, కంసాలె, యక్షగాన తదితర కళాబృందాలు పెద్దసంఖ్యలో పాల్గొని సందడి చేశాయి.

విద్యుత్ కాంతుల వెలుగులో విధానసౌధ ఆకట్టుకుంది.



కళాకారులతో కలిసి తాళం వేస్తున్న సీఎం, డీసీఎం

అవ్వకు ఉపశమనం
- జీవిత ఖైదు అనుభవిస్తున్న 93ఏళ్ల బామ్మకు పెరోల్

7

సైనికుడి ఇంటి ఎదుట నిరసన
- పెళ్లి చేసుకుని మోసగించాడని మహిళ ఆరోపణ

పాఠకులకు గమనిక

సాంకేతిక కారణాల వల్ల 'కార్ అండ్ బైక్ రేస్' నవంబరు నెల 3వ కూపన్‌ను 30-11-2024 తేదీన ప్రచురించలేకపోయాము. ఈ రోజు ప్రచురించిన కూపనును నవంబరు నెల 3వ కూపనుగా పరిగణించవలసినదిగా కోరుతున్నాము.

రాయలసీమ పొలికేకకు తరలిరండి

- సీమ జిల్లాలకు న్యాయం జరగాలంటే చేతులు కలపాలి
- ప్రవాసాంధ్రులకు కుంచం పిలుపు

బెంగళూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాయలసీమ సాధ నకై డిసెంబరు 27న తిరుపతిలో నిర్వహిస్తున్న 'రాయలసీమ పొలికేక' సభకు బెంగళూరులో స్థిరపడిన ప్రవాస రాయలసీమ వాసులు తరలి రావాలని రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంక టసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. బెంగళూరులో శనివారం తెలుగు ప్రతి నిధులను ఆహ్వానించారు. ఇదే సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలకు తరతరాలుగా జరుగుతున్న అన్యాయాలను చాటి చెప్పేందుకు సభ జరుపుతున్నామన్నారు. కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కృష్ణ, తుంగభద్ర, పెన్నా నదుల అనుసంధా నంతో 36లక్షల ఎకరాలకు సాగునీరు కల్పిం చేందుకు 1900లోనే బ్రిటీష్ ఇంజనీర్ సర్ మెకంజీ రూపకల్పనకు ఆచరణ జరగలేద న్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కృష్ణ, పెన్నార్ ప్రాజెక్టు 1951లోనే కమిషన్ ఆమోదం పొందినా అమలు చేయలేకపో యారన్నారు. శ్రీభాగ్ ఒప్పందంతో నీటిపై హక్కులు లేకుండా పోయాయన్నారు. నాగార్జున సాగర్ నుంచి రాయ లసీమకు ఒక చుక్కనీరు లభించలేదని, సమైక్యాంధ్రపేరిట కోస్తాకు తర లిందన్నారు. ప్రత్యేక రాయలసీమ నినాదం రాజకీయ పార్టీలతో సంబంధం లేనిదన్నారు. అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నామన్నారు. తమి ళనాడు, కర్ణాటకలోని సరిహద్దు జిల్లాల పరిస్థితి రాయలసీమ తరహా లోనే ఉందని వీటిని ఉమ్మడి రాయలసీమలో కలపాలన్నారు. రాయల సీమవాణిని ఢిల్లీలోనూ వినిపించదలిచామన్నారు.



తెలుగుసంఘాల ప్రముఖులతో కుంచం వెంకట సుబ్బారెడ్డి

బాలింతల మృతికి ఐవీ ఫ్లూయిడ్సే కారణం

- స్టేట్ డ్రగ్స్ కంట్రోలర్ సస్పెన్షన్
- బాధిత కుటుంబాలకు కంపెనీ పరిహారం ఇవ్వాలి
- బ్లాక్ లిస్టులో రింగర్ లాక్టేర్ కంపెనీ
- వైద్యాధికారులతో సీఎం సమావేశం

బళ్లారి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బళ్లారి ప్రభుత్వ ఆసు పత్రి(గోషా ఆసుపత్రి)లో ఈనెల 11 నుంచి 15 వరకూ నలుగురు బాలింతల మృతికి వారికి అందించిన ఐవీ ఫ్లూయిడే కారణమని తేలింది. ఘటనపై బెంగళూరులో శనివారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య వైద్యులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. గర్భిణీల మృతిపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తెలిసిన వివరాల ప్రకారం సీఎం సమావేశంలో చర్చించారు. ఐ.వీ. ఫ్లూయిడ్ లోపం వల్ల బాలింతలు మృతి చెందారని నిర్ధారించారు. రింగర్ లాక్టేట్ అనే ఫ్లూయిడ్ కంపెనీని బ్యాన్ చేస్తున్నట్లు సీఎం తెలిపారు. రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్ ఉమేష్ ను సస్పెండ్ చేశారు. అంతే కాకుండా ఐ.వీ ఫ్లూయిడ్ కంపెనీ మరణిం చిన బాలింతలకు నష్టపరిహారం ఇవ్వాలని సూచించారు. గర్భిణులకు వైద్యం అందించడంపై ఆరా తీశారు. ఇప్పటికే కొందరు డిశ్చార్జ్ కాకా మరి కొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జిల్లా సర్జన్ పై సీఎం సీరియస్: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి(గోషా ఆసు పత్రి) లో జిల్లా సర్జన్ గా విధులు నిర్వహిస్తున్న బసిరెడ్డి పై సీఎం సీరి యస్ అయ్యారు. బాలింతల మృతి చెందుతున్నా ఎందుకు అప్రమత్తం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఓపీలో సెప్టిక్ కూడా అయిందని రిపోర్టులో ఉంది. ఎందుకు అలా జరిగింది అని మండిప డ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దినేష్ గుండూరావ్ తో పాటు జిల్లా ఇన్‌చార్జర్ మంత్రి వైద్యాధికారులు హాజరయ్యారు.



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న సీఎం సిద్దరామయ్య, మంత్రులు

అభివృద్ధి.. మీ బాధ్యత: సీఎం

అనంతపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేద్దాం. అందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు. నేమకల్లులో ప్రజావేదిక అనంతరం హెలీప్యాడ్ వద్ద కలెక్టర్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. అభివృద్ధి గురించి చర్చించారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేద్దామని, అందుకు అవసరమైన భూములు గుర్తించాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఉద్యాన పంటల ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు అనువైన ప్రాంతాన్ని, అవసరమైన భూములను గుర్తించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా రైతాంగానికి సాగునీరును అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పనుల పురోగతిని ప్రభుత్వం దృష్టి తీసుకురావాలని, నిధుల కోసం చొరవ చూపాలని అన్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ ప్రధాన సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అనంతపురంలో డంపింగ్ యార్డు మార్చేందుకు అనువైన ప్రాంతం చూడాలని, బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు చొరవ చూపాలని చంద్రబాబు సూచించారు. శింగనమల నియోజకవర్గానికి తాగునీటిని అందించేందుకు గండికోట నుంచి పైపులైన్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. పేరూరు, అప్పర్ పెన్నార్ పనులు కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. నడిమి వంక ప్రొటెక్షన్ వాల్, రాప్తాడులో జాకీ పరిశ్రమను తిరిగి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



సీఎంతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు



ఉమ్మడి జిల్లా నాయకుల సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు సవిత, కేశవ్, కలెక్టర్



సీఎంతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు



చంద్రబాబును దగ్గరగా చూసిన ఆనందం



మహిళల కేరింతలు

ప్రగతికి బాటలు





పలకరింపులు.. పులకరింపులు

పింఛన్ లబ్ధిదారుల ఇంటికి చంద్రబాబు

వీధుల్లో నడుస్తూ.. జనంతో మాటామంతీ

బొమ్మనహాళ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేమకల్లులో పాల్తూరు రుద్రమ్మ, భాగ్యమ్మ ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. వారిని ఆప్యాయంగా పలకరించారు. కుటుంబ పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. రుద్రమ్మ ఇంట్లో టీ ఇవ్వబోతే.. ధన్యవాదాలు తెలిపారు. భాగ్యమ్మ ఇంట్లో టీ స్వీకరించారు. గ్రామ వీధుల్లో నడుస్తూ.. ప్రజలను పలకరించారు. కొందరు సెల్ఫీలు తీసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఓ సాధారణ పౌరుడిలా తమ ఊరి వీధుల్లో తిరగడం చూసి జనం మురిసిపోయారు.



పాల్తూరు రుద్రమ్మ: నమస్కారం సార్ బాగున్నారా ?
చంద్రబాబు: నమస్కారం అమ్మా. మీరు బాగున్నారా ? ఎంత మంది కొడుకులు ?
పాల్తూరు రుద్రమ్మ: బాగున్నాము సార్, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు.
చంద్రబాబు: ఫింఛన్ డబ్బులు ఎంతిస్తారు ?
పాల్తూరు రుద్రమ్మ: నాలుగు వేలు ఇస్తున్నారు సార్.
చంద్రబాబు: కొడుకులు ఏం పని చేస్తారమ్మా ?
పాల్తూరు రుద్రమ్మ: వ్యవసాయం చేస్తున్నారు సార్
చంద్రబాబు: మీ కుటుంబానికి ఏమి కావాలమ్మా..?
పాల్తూరు రుద్రమ్మ: గొర్రెలు, ఇల్లు కావాలి సార్.
చంద్రబాబు: సరే అమ్మా. మీకు ఇల్లు, గొర్రెలు ఇస్తాము.

రుద్రమ్మ కొడుకులు గణేష్, మారేష్‌తో..

చంద్రబాబు : బాగా పనిచేసుకోవాలి. ఊరికే ఉంటే ఎలా ? పొలం ఎంత ఉంది..?
గణేష్, మారేష్ : రైతు పని చేస్తున్నాం సార్. మూడెకరాలు ఉంది సార్, పంట సరిగా రావడం లేదు.
చంద్రబాబు : ఓకే అమ్మా.. మీకు సాయం చేస్తా.. వస్తాను.

■ **దివ్యాంగురాలు భాగ్యమ్మ ఇంట్లో..**



భాగ్యమ్మ : నమస్కారం సార్
చంద్రబాబు : నమస్కారం అమ్మా. ఫింఛన్ ఎవరికి వస్తుంది..?
భాగ్యమ్మ : నాకు, మా నాన్నకు వస్తుంది సార్.
చంద్రబాబు : ఎంత వస్తుందమ్మా ?
భాగ్యమ్మ: నాకు 15 వేలు, మా నాన్నకు నాలుగు వేలు సార్..
చంద్రబాబు: పొలం ఎంత ఉంది ?
భాగ్యమ్మ : ఏడెకరాలు ఉంది.
చంద్రబాబు: ఇంట్లో ఎంత మంది ఉన్నారు ?
భాగ్యమ్మ: తొమ్మిది మంది ఉన్నాం సార్.
చంద్రబాబు: పింఛన్ డబ్బులు ఏమి చేస్తున్నారు ?
భాగ్యమ్మ: నా తమ్ముడి కూతురు జాహ్నవికి బాగా లేదు. వైద్యం కోసం ఖర్చు పెడుతున్నాం సార్.
చంద్రబాబు: ఓకేనమ్మా మీకు ఇల్లు కట్టించి, కిరాణాషాపు పెట్టిస్తాం. ఆర్థిక సాయం చేస్తాం.
భాగ్యమ్మ : టీ తాగండి సార్
చంద్రబాబు : సరే అమ్మా.. ఇవ్వండి..

■ (టీ తాగిన తర్వాత ప్రజావేదికపై చంద్రబాబు భాగ్యమ్మ తమ్ముడి కూతురు వైద్య ఖర్చుల కోసం రూ.రెండు లక్షల చెక్కును అందించారు. భాగ్యమ్మ ఇంటి నుంచి వస్తూనే రోడ్డు పక్కన అంగడి పెట్టుకున్న హనుమేష్‌ను పలకరించారు..)



చంద్రబాబు: ఏం తమ్ముడూ బాగున్నావా ?
హనుమేష్: బాగున్నాను సార్.
చంద్రబాబు : ఏం అంగడి ?
హనుమేష్: కిరాణా అంగడి సార్.
చంద్రబాబు: ఎంత వ్యాపారం అవుతుంది ?
హనుమేష్ : రూ.100 నుండి రూ.150 వస్తుంది సార్
చంద్రబాబు: నెలకు ఎంత వ్యాపారం అవుతుంది..?
హనుమేష్: ఐదు వేల వరకూ అవుతుంది సార్.
చంద్రబాబు: కలెక్టర్ గారూ, సూపర్‌మార్కెట్ కోసం లోన్ మంజూరు చేయించండి.

రాయదుర్గం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాయదుర్గం నియోజకవర్గ ప్రగతికి బాటలు వేసేలా వరాల జల్లు కురిపించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సమర్పించిన వినతి పత్రంలో పొందుపరిచిన అంశాలన్నింటికీ సానుకూలంగా స్పందించారు. ప్రజా వేదిక మీదుగా ఆయన పలు హామీలు ఇచ్చారు. నేమకల్లు-ఉంతకల్లు మధ్యలో ఐదు టీఎంసీల సామర్థ్యంతో ప్రతిపాదించిన రిజర్వాయర్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి నుంచి కృష్ణజలాలను మళ్లించేందుకు రూ.965 కోట్లతో చేపట్టిన పనులు 35 శాతం మాత్రమే పూర్తయ్యాయి. వైసీపీ హయాంలో పనులు ఆగిపోయాయని, వాటిని పూర్తి చేసే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని చంద్రబాబు అన్నారు. కృష్ణజలాలతో రాయదుర్గం నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని భరోసానిచ్చారు. తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా 36ఎ ప్యాకేజీ ద్వారా మాల్యం, ఆవులదట్ల డిస్ట్రిబ్యూటరీ పనులను పూర్తి చేసి, నీరిస్తామన్నారు. జిల్లాలో ఎడారి ఛాయలు ఇక్కడి నుంచే మొదలు అవుతున్నాయనే విషయం తనకు తెలుసునని, 20 వేల ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఇసుకమేటలను నియంత్రించేందుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఇనుప ఖనిజ నిక్షేపాలు అధికంగా ఉన్న ప్రాంతం కావడంతో నేమకల్లు - డి.హీరేహాళ్ మధ్యలో ఉన్న స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల ప్రాంతాన్ని పారిశ్రామిక పార్క్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. డి.హీరేహాళ్‌లో సబ్ సర్ఫేస్ డ్యాం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రాయదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని అన్నారు. బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట చెరువును హెచ్చెల్సీకి అనుసంధానించి, సాగునీరు ఇస్తామని అన్నారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రాయదుర్గం నియోజకవర్గం అత్యంత వెనుకబడి ఉందని, అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని ప్రకటించారు.

ఉంతకల్లు, బీటీపీ పనులకు భరోసా
నేమకల్లులో సోలార్ పైలెట్ ప్రాజెక్టు
ప్రజా వేదికపై ప్రకటించిన చంద్రబాబు

నేమకల్లులో సోలార్ పైలెట్ ప్రాజెక్ట్

'ఇంటింటికీ సోలార్ పవర్ ప్రాజెక్టును నేమకల్లు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. నేమకల్లులో ఉన్న 759 ఇళ్లపై సోలార్ ప్యానల్స్‌ను సబ్సిడీ ద్వారా అమర్చి విద్యుత్ ఉత్పత్తి చేయిస్తామని అన్నారు. ఇంటికి అవసరమైన విద్యుత్‌ను వాడుకుని, మిగిలిన విద్యుత్‌ను విక్రయించే అవకాశం కూడా కల్పిస్తామని అన్నారు. 1,49,721 చదరపు అడుగులలో సోలార్ ప్యానల్స్ అమర్చి 1379 కిలో వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తి పైలెట్ ప్రాజెక్టును ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నామని సీఎం ప్రకటించారు.

సెల్‌ఫోన్‌లో పౌర సేవలు

ఇంట్లో కూర్చుని సర్టిఫికెట్లు తీసుకోవచ్చు
గంజాయి, ఇసుక మాఫియా తోలు తీస్తాం
రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపిస్తాం
నేమకల్లు సభలో సీఎం చంద్రబాబు



రాయదుర్గం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చేతిలో ఉండే సెల్‌ఫోన్‌తో కుటుంబంలోని ప్రతి వ్యక్తికి ప్రభుత్వ సేవలన్నీ అందించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నేమకల్లులో శనివారం ఫింఛన్ల పంపిణీ అనంతరం 'ప్రజా వేదిక పేదల సేవలో..' సభలో మాట్లాడారు. ఆయన ప్రసంగం ప్రవాహంలా గంటకుపైగా సాగింది. రాష్ట్ర అభివృద్ధి గురించి ప్రసంగించారు. మద్యం, గంజాయి, ఇసుక మాఫియా తోలు తీస్తామని హెచ్చరించారు. నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం ముందు కార్యక్రమం జరుగుతోందని, స్వామి ఆశీస్సులు మెండుగా ఉన్నాయని అన్నారు. ఎన్నికలకు ముందు 11వ తేదీన కణేకల్లుకు వచ్చానని, ఆ 11 అంకెను ప్రతిపక్షానికి ఇచ్చానని చమత్కరించారు. సభలో ఉన్న అందరూ తమ సెల్‌ఫోన్‌లను ఎత్తి చూపాలని కోరారు. భవిష్యత్తులో సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే అందిస్తామని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి సర్టిఫికెట్లు తీసుకునే పరిస్థితి ఉండదని అన్నారు. స్వామివారి దర్శనం చేసుకుని బయటకు రాగానే వేదిక వద్ద ఉన్న జనం కేరింతలు వేశారు. ఆయన ప్రసంగాన్ని ఉత్సాహంగా వింటూ.. చప్పట్లతో మద్దతు తెలిపారు. రేషన్ బియ్యం అమ్ముకుంటున్నారని, రేషన్ మాఫియాను కట్టడి చేస్తామని అన్నారు. భవిష్యత్తులో యువతకు ఉద్యోగాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. అధికారం చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు ఫైళ్లపై సంతకాలు పెట్టామని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేనంతగా రూ.4 వేలు పింఛన్ ఇస్తున్నామని చెబుతూ.. ఇతర రాష్ట్రాలలో ఎంత ఇస్తున్నారో గణాంకాలను తెలిపారు. దీపం-2 పథకం గురించి వివరిస్తూ.. తన తల్లి కట్టెల పొయ్యితో పడిన కష్టాలను గుర్తు చేసుకున్నారు. మహిళలు ఎవరికీ ఆ కష్టం ఉండకూడదనే అప్పట్లో దీపం పథకం తెచ్చామని, ఇప్పుడు ఉచిత గ్యాస్ సిలెండర్లు అందిస్తున్నామని అన్నారు. అర్హులందరికీ ఉచిత సిలెండర్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని అన్నారు. నాలుగు గంటల పాటు సాగిన సీఎం పర్యటన.. ప్రశాంతంగా ముగిసింది.

ఏ హడావుడీ లేకుండా..

ముఖ్యమంత్రి పర్యటన అంటే.. ఎక్కడ లేని నిబంధనలను అమలు చేస్తారు. దుకాణాలను మూసివేయిస్తారు. వైసీపీ హయాంలో పరదాలనూ కట్టించారు. చెట్లు నరికించి, బారికేడ్లు ఏర్పాటు చేయించి.. నిర్బంధం మధ్య పర్యటనలు సాగించారు. కూటమి ప్రభుత్వం అలాంటి సంస్కృతికి చరమగీతం పాడింది. నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం వద్ద సీఎం సభ ఉన్నా.. ఆలయ కాంప్లెక్స్ ఉండే దుకాణాలు యథాతథంగా తెరిచారు. ఎప్పటిలాగే వ్యాపారాలు చేసుకున్నారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బంది కలిగించలేదు. ముందస్తు అరెస్టులు లేవు. ప్రజలందరూ స్వేచ్ఛగా ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గొన్నారు. జనసమీకరణ ఏమాత్రం చేయలేదు. ఆ ఊరి ప్రజల మధ్య సభ సాగింది. ఎక్కడ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడలేదు.



చంద్రన్నకు అంజన్న చిత్రపటం కానుక

చంద్రబాబు కృషితోనే హార్టికల్చర్ హబ్: అంబికా



కరువు ప్రాంతమైన జిల్లాపై చంద్రబాబు ప్రత్యేక ప్రేమాభిమానాలు చూపిస్తున్నారని ఎంపీ లక్ష్మీనారాయణ అన్నారు. చంద్రబాబు చొరవతో 2014 నుంచి జిల్లాలో అరటిసాగు పెరిగిందని, 20 టన్నులతో అప్పట్లో ఎగుమతిని ప్రారంభించి.. ఏకంగా లక్ష టన్నులకు చేర్చారని కొనియాడారు. అరటి ఎగుమతి కోసం ప్రత్యేక రైలును ఏర్పాటు చేయించారని, అనంత అరటి విదేశాలకు పంపేస్థాయికి చేర్చారని అన్నారు. 10వేల హెక్టార్లలో పండించిన 8.5 లక్షల టన్నుల అరటిలో లక్ష టన్నుల అరటిని విదేశాలకు పంపుతున్నామని అన్నారు. జిల్లా హార్టికల్చర్ హబ్‌గా మారిందని, ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేస్తే అరటి, దానిమ్మ, సపోట, బత్తాయి దిగుబడులను విదేశాలకు పంపే అవకాశం ఉంటుందని అన్నారు. ఇప్పటికే జిల్లాలో ఏడు కరువు మండలాలను ప్రకటించారని, మిగిలిన మండలాలను కూడా ప్రకటించాలని కోరారు.

దేశం మెచ్చే నాయకుడు: కాలవ



ఐదేళ్ల దుష్టపాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించిన చంద్రబాబు దేశం మెచ్చే నాయకుడు అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. నేమకల్లు ప్రజావేదికపై ఆయన ప్రసంగించారు. కాలవ అధ్యక్షతన జరిగిన సభలో సీఎం చంద్రబాబుతో పాటు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు మహాలక్ష్మి పాల్గొన్నారు. నేమకల్లు - ఉంతకల్లు మధ్యలో రిజర్వాయర్ నిర్మించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కాలవ విజ్ఞప్తి చేశారు. రాయదుర్గంపై చంద్రబాబుకు ప్రత్యేక ప్రేమాభిమానాలు ఉన్నాయని అన్నారు. 2014-19 మధ్య కాలంలో రూ.4500 కోట్లు మంజూరు చేసి ఆదుకున్నారని గుర్తు చేశారు. జిల్లాకు వరప్రసాదం లాంటి హంద్రీనీవా తొలిదశ విస్తీరణ పనులను త్వరలో చేపట్టడానికి సీఎం సంసిద్ధులై ఉన్నారని అన్నారు. అది పూర్తి అయితే భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు నీరు వస్తుందని అన్నారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు 36ఎ ప్యాకేజీ కింద 64 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఎడారీకరణ ఆగేలా సీఎం చర్యలు తీసుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. బీసీలు అధికంగా ఉన్న నేమకల్లులో బాలురకు ప్రత్యేక ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. పీహెచ్‌సీతో పాటు ఆంజనేయస్వామి గోపురానికి రూ.3.75 కోట్లు మంజూరు చేయాలని, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలను పూర్తి చేయడానికి రూ.ఐదు కోట్లు మంజూరు చేయాలని కోరారు.



చెల్లెమ్మ సెల్ఫీ సంబరం

రాయదుర్గం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు నేమకల్లు హెలీప్యాడ్ వద్ద ఘనస్వాగతం లభించింది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, సెర్ప్ సీఈఓ వీర పాండ్యం సీఎంకు స్వాగతం పలికారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సిధూరా రెడ్డి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, అహూడా చైర్మన్ టీసీ వరుణ్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చంద్రబాబుకు పుష్ప గుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేసి స్వాగతం పలికారు.

పర్యటన ఇలా..

సీఎం చంద్రబాబు మధ్యాహ్నం 1.30 గంటలకు నేమకల్లు హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడే ఉన్న వాహనంలో మధ్యాహ్న భోజనాన్ని ముగించారు. ఆ తరువాత 2.20 గంటలకు రుద్రమ్మ ఇంటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. 2.36 గంటలకు భాగ్యమ్మ ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు. అక్కడి నుంచి గ్రామ వీధుల్లో నడుచుకుంటూ 2.48 గంటలకు నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. దర్శనం ముగించుకుని 3.05 గంటలకు ప్రజావేదిక వద్దకు చేరుకుని ప్రసంగించారు. 4.12 గంటలకు సమావేశాన్ని ముగించుకుని హెలీప్యాడ్ వద్దకు బయలుదేరారు. 4.25 గంటలకు హెలీక్యాప్టర్‌లో బళ్లారిలోని జిందాల్ విమానాశ్రయానికి బయలుదేరారు.

స్వాగతం.. సుస్వాగతం..!



పూల బొకేతో కాలవ స్వాగతం



చంద్రబాబుకు నమస్కరిస్తున్న కేశవ్



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకటప్రసాద్, దగ్గుపాటి ప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, జేసీ అశ్మిత్‌రెడ్డి, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి



ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, ఎమ్మెస్ రాజు

కలెక్టర్‌తో మాట్లాడుతున్న సీఎం

మొక్క అందజేసిన జేసీ..

అసిస్టెంట్ కలెక్టర్..

డీఐజీతో మాటా..మంతీ

సీఎంతో ప్రభాకర్ చౌదరి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

నార్ల వెంకటేశ్వరరావు (జయంతి)



వీఆర్ నార్లగా సుపరిచితులైన ప్రముఖ రచయిత నార్ల వెంకటేశ్వర రావు 1908 డిసెంబరు 1న మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో జన్మించారు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికలకు చాలా కాలం సంపాదకులుగా వ్యవహరించారు. పలు నాటికలు, కథలు రాశారు. జర్నలిజానికి ఎనలేని సేవలు అందించారు. హేతువాదిగా, మానవతా వాదిగా జీవించారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యునిగా వ్యవహరించారు. బౌద్ధ కళలపట్ల ప్రత్యేక అభిమానం కల్గినవారు. 1985 ఫిబ్రవరి 16న కన్నుమూశారు. కుటుంబీకులు ఆయన రచనలను అన్నీ కూర్చి ఇటీవలే 'నార్ల రచనలు'గా పలు విభాగాలుగా వెలువరించారు.

వ్యాసరాయ బల్లాళ (జయంతి)



కన్నడ సాహితీవేత్త వ్యాసరాయ బల్లాళ 1923 డిసెంబరు 1న కర్ణాటక రాష్ట్రం ఉడుపి జిల్లా అంబలపాడిలో జన్మించారు. 'బండాయ', 'హేమంతగాన', అనురక్త, వాత్సల్యపథ, 'ఉత్తరా యణ' తదితర రచనలు పేరొందాయి. 25 నవలలు, వందలాది కథలు రాశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, గద్యభాస్కర అవార్డు, కర్ణాటక సాహిత్య అకాడమీ గౌరవ పురస్కారం తదితర పురస్కారాలు అందుకున్నారు. 2008 జనవరి 30న కన్నుమూశారు.

విజయలక్ష్మి పండిట్ (వర్ధంతి)



విజయలక్ష్మి పండిట్ 1900 ఆగస్టు 18న అలహాబాద్ (ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్) లో జన్మించారు. అసలుపేరు స్వరూప్ కుమారి నెహ్రూ. స్వాతంత్ర్య సమర యోధుడు, కాంగ్రెస్ అగ్రనేత మోతీలాల్ నెహ్రూ కుమార్తె. యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ తొలి మహిళా అధ్యక్షురాలిగా వ్యవ హరించిన ఘనత ఆమెకే దక్కుతుంది. మహారాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరించారు. 1967-71ల మధ్య లోక్‌సభ సభ్యురాలిగా కొనసాగారు. పలు దేశాలకు రాయబారిగా వ్యవహరించారు. 1990 డిసెంబరు 1న కన్నుమూశారు.

ఉదిత్ నారాయణ్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత ఉదిత్ నారాయణ్ 1955 డిసెంబరు 1న నేపాల్‌లో జన్మించారు. రేడియోలో ఏడేళ్లపాటు స్టాఫ్ ఆర్టిస్ట్‌గా పని చేశారు. ఆయన ప్రతిభను మెచ్చి అక్కడి భారతీయ ఎంబసీ అధికారులు భారతీయ విద్యాభవన్‌లో శాస్త్రీయ సంగీతం నేర్చుకునేలా ప్రోత్సహించారు. ప్రత్యేకించి బాలీవుడ్‌లో నేపథ్య గాయకుడిగా రాణించగా, భారతీయ భాషలలోనూ, నేపాలీలోనూ పేరొందారు. 34 భాషల్లో 25వేలకుపైగా పాటలు పాడారు. మూడు దశాబ్దాలకుపైగా జాగరణ్ ఫిల్మ్‌ఫెస్టివల్‌కు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. పద్మశ్రీ, మిర్చి మ్యూజిక్, 4 జాతీయ, 5 ఫిల్మ్‌ఫేర్‌తోపాటు అంతర్జాతీయ, జీవిత సాఫల్య తదితర పురస్కారాలు పొందారు.

అర్జున రణతుంగ (పుట్టినరోజు)



అర్జున రణతుంగ 1963 డిసెంబరు 1న శ్రీలంక దేశం గంపహ ప్రాంతంలో జన్మించారు. శ్రీలంక క్రికెటర్‌గా పేరొందారు. ఆయన కేప్టెన్సీలో 1996లో క్రికెట్ వరల్డ్‌కప్ కైవశం చేసుకున్నారు. 11ఏళ్లపాటు కేప్టెన్‌గా కొనసాగారు. ఎడమచేతి బ్యాటింగ్ శైలితో వన్డే క్రికెట్‌లో తనదైన గుర్తింపు పొందారు. 2001లో క్రికెట్‌నుంచి రిటైరయ్యాక శ్రీలంక క్రికెట్ అడ్మినిస్ట్రేషన్‌లో పలు హోదాలలో కొనసాగారు. రాజకీయాల్లో రాణించి మంత్రిగా వ్యవహరించారు.

సౌరభ్ రాజ్ జైన్ (పుట్టినరోజు)



సౌరభ్‌రాజ్ జైన్ 1985 డిసెంబరు 1న ఢిల్లీలో జన్మించారు. నటుడు, మోడల్‌గా రాణించారు. మహాభారత్‌లో శ్రీకృష్ణ పాత్రలోనూ, దేవోంకి దేవ్ మహదేవ్‌లో శ్రీమహావిష్ణువు పాత్రలోనూ పేరొందారు. అనేక బుల్లితెర సీరియల్స్‌తోపాటు సినిమాలలో నటించారు. 2019 డ్యాన్స్ రియాలిటీ సిరీస్ షోలలో కూడా పాల్గొని సత్తా చాటుకున్నారు.

రూ.25 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

చింతామణి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు అంశాన్ని నెపం చేసుకుని బీజేపీ నాయకులు ప్రజలమధ్య చిచ్చు పెడుతున్నారని అభివృద్ధి పట్ల దృష్టి సారించడం లేదని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి, చిక్కబళ్ళాపుర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అభిప్రాయపడ్డారు. చింతామణి తాలూకాలో రూ.25కోట్లతో వివిధ రహదారుల అభివృద్ధి, అంబేడ్కర్ పాఠశాల భవనం, పట్టణ శివారులోని ఐటీఐ కళాశాల భవనం పనులకు శనివారం భూమిపూజ నిర్వహించి మాట్లాడారు. తాను శాసనసభ ఎన్నికల్లో రెండుసార్లు ఓటమి చెందానని అయితే ఎప్పుడూ కన్నీరు పెట్టలేదన్నారు. అయితే కేంద్రమంత్రి కుమారస్వామి, నిఖిల్‌లు ఒక్కో నియోజక వర్గానికి వెళ్లి కన్నీరు పెట్టారన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి ప్రజాతీర్పును గౌరవించాలన్నారు. చక్కటి అభివృద్ధి పనులు చేస్తే ప్రజలు తప్పక గెలిపిస్తారని అందుకు ఇటీవలి ఉప ఎన్నికల్లో సీపీ యోగేశ్వర్ విజయమే కారణమని గతంలో ఆయన చేపట్టిన నీరావరి పథకాలను ప్రస్తావించారు. కాగా తాను మంత్రి అయ్యాక నియోజకవర్గంలో రెండు రోజులు మాత్రమే సమయం కేటాయించగలుగుతున్నానన్నారు. తాలూకా సమగ్ర అభివృద్ధియే లక్ష్యమన్నారు. తాలూకా, పట్టణ బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



భూమిపూజలో మంత్రి సుధాకర్ తదితరులు

వ్యసనాలకు దూరంగా ఉండాలి



ప్రసంగిస్తున్న డీసీపీ శివకుమార్

మహదేవపుర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మత్తు, క్షణిక సుఖం కోసం మాదకద్రవ్యాల వ్యసనాలకు లోనుకారాదని వైట్‌ఫీల్డ్ డీసీపీ డాక్టర్ శివకుమార్ యువతకు పిలుపునిచ్చారు. కేఆర్‌పుర ప్రభుత్వ కళాశాల, అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు శనివారం ప్రత్యేక జాగృతి సమావేశం నిర్వహించారు. మనిషి జీవితంలో ఆరోగ్యమే కీలకపాత్ర అన్నారు. మాదకద్రవ్యాల సేవనంతో ఆరోగ్యంపై పెనుప్రభావం చూపడమే కాక ఆర్థికంగా కుటుంబానికి భారమై ప్రశాంతత కోల్పోతారన్నారు. మత్తుపదార్థాలకు బానిసలైనవారి కొందరి జీవితాలను ప్రస్తావించారు. సరైన మార్గంలో ముందుకు సాగి సమాజంలో మంచి పేరు పొందాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసిన ఎంతోమంది ఉన్నత హోదాలు అందుకున్నారని చక్కగా చదివి ప్రయోజకులు కావాలని హితవు పలికారు. వ్యసనాలకు లోనై జీవితాన్ని పాడు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో మహదేవపుర సీఐ ప్రవీణ్‌బాబు, హాస్టల్ వార్డెన్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల నమోదుకు ఉత్సాహం



హెల్ప్‌డెస్క్‌లో నమోదు చేసుకున్నవారు, నిర్వాహకులు

బెంగళూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఉమ్మడి కృష్ణ, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బెంగళూరు తెలుగుదేశం ఫోరం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో ఓటరుగా నమోదుకు ఉత్సాహం చూపారు. మారతహళ్ళిలోని టీడీపీ ఫోరం కార్యాలయంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా నమోదు చేసినట్టు తెలిపారు. పార్టీ సభ్యులుగా వందమంది చేరగా పరిశీలన, కొత్తగా నమోదుకు వందమందికిపైగా పాల్గొన్నట్టు ఫోరం సభ్యులు తెలిపారు. హెల్ప్‌డెస్క్‌ను చనుమోలు శివ, లెనిన్ కొండవీటి, రవి లింగుట్ల, వెంకటేశ్, చైతన్య, సాయి రమేశ్, సతీశ్, రామాంజనేయులు తదితరులు పర్యవేక్షించారు.

కన్నడను ప్రోత్సహించండి



ప్రతిభా పురస్కారాల ప్రదానంలో ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బంగారపేట తాలూకా సరిహద్దుల్లో ఉండడంతో ఒకవైపు తెలుగు, మరోవైపు తమిళభాషల ప్రభావం ఉందని ఇంతటి తరుణంలో కన్నడభాష మనుగడకు డాక్టర్ రాజ్‌కుమార్ అప్పట్లో గోకాక్ ఉద్యమాన్ని బంగారపేటలో నిర్వహించారని ఎమ్మెల్యే నారాయణ స్వామి స్మరించుకున్నారు. పట్టణంలోని బాలికల పీయూ కళాశాలలో కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా విభాగం ఆధ్వర్యంలో శనివారం కన్నడ రాజ్యోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఎస్ఎల్‌సి, పీయూసీలలో కన్నడలో అత్యధిక మార్కులు సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేసి మాట్లాడారు. అప్పట్లో కెజిఎఫ్, బంగారపేటలలో తమిళ సినిమాలు అత్యధికంగా ప్రదర్శించేవారన్నారు. తీవ్రమైన పోరాటాలతో కన్నడ భాషకు మనుగడ సాధించారన్నారు. పిల్లలు తమ ఇళ్లల్లో తమకు ఇష్టం వచ్చిన భాసలో మాట్లాడినా వ్యవహారం, రాయడం, చదివే అంశాలలో కన్నడకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కన్నడ సాహిత్య పరిషత్ మూడేళ్లుగా పలు రకాల కార్యక్రమాలతో కన్నడను పెంపొందించేలా కృషి చేస్తోందన్నారు. కన్నడభాష నేర్చుకుంటే ప్రభుత్వ ఉద్యోగాలు కూడా సాధ్యమన్నారు. సరిహద్దు తాలూకాలోని కనమన హళ్ళి, గుల్లహళ్ళి గ్రామాల విద్యార్థుల కన్నడలో వందశాతం ఉత్తీర్ణత సాధించడంపై ప్రశంసించారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు గోవింద, జిల్లా కసాప అధ్యక్షుడు నాగానంద, కెంపరాజు, సమన్వయా అధికారి శశికళ, ప్రిన్సిపాల్ సుబ్రమణ్య, మురళి, వైస్‌ప్రిన్సిపాల్ హనుమంత వగ్గర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో సత్తా చాటాలి



అభ్యర్థులతో సీకల్ రామచంద్రగౌడ తదితరులు

శిడ్లఘట్ట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారుల సభ్యులను పెంచుకోవడం ద్వారా తాలూకా, జిల్లా పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు అనుకూలం కాగలదని బీజేపీ రూరల్‌స్థాయి హోబళి అధ్యక్షుడు నాయకుడు సీకల్ రామచంద్రగౌడ పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ మద్దతుదారులైన అభ్యర్థులు పట్టణంలోని బీజేపీ సేవా సౌధలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. రామచంద్రగౌడ మాట్లాడుతూ భక్తరహళ్ళి, మళమాచనహళ్ళి, నాగమంగల, హోసేట గ్రామపంచాయతీల పరిధిలోని అనేక చోట్ల బీజేపీ మద్దతుదారులు నామినేషన్ సమర్పించారన్నారు. ఇదే తొలిసారి పంచాయతీస్థాయిలో పార్టీ మద్దతుదారులు భారీ సంఖ్యలో పోటీ చేస్తున్నారన్నారు. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వ సాధనలు, పథకాలను కార్యకర్తలు ప్రచారం చేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో తాదూరు రమేశ్, భక్తరహళ్ళి, మళమాచనహళ్ళి, నాగమంగల, హోసపేట గ్రామపంచాయతీలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

కబ్బన్‌పార్కులో రంగుల ఉత్సవం

బెంగళూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవనశాఖ, కబ్బన్‌పార్క్ వాకర్స్ అసోసియేషన్‌లు సంయుక్తంగా కన్నడరాజ్యోత్సవం, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా రంగుల ఉత్సవం సందడి చేసింది. ఉద్యానవనశాఖ జాయింట్ డైరెక్టర్ కుసుమ ముగ్గుల పోటీలను శనివారం ప్రారంభించారు. డొళ్ళుకుణిత, హంపి రథం, గండభేరుండ లాంఛనం, మైసూరు ఒడెయార్ సర్కిల్‌లు ఒకే ముగ్గులో వేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రంగవల్లుల పోటీల్లో యువతులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సందర్శకులు ఆసక్తిగా వీక్షించారు.





రంగవల్లులను వీక్షిస్తున్న అధికారులు

అభివృద్ధి పేరిట పర్యావరణంపై దాడి

▸▸ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ



సదస్సును ప్రారంభిస్తున్న జస్టిస్ గోపాలగౌడ తదితరులు

బెంగళూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విశ్వవ్యాప్తంగా సుస్థిర అభివృద్ధి పేరిట పర్యావరణంపై మరిన్ని దాడులు చేస్తున్నారని ఇది తీరని ప్రమాదకరమని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ అన్నారు. నగరంలోని ప్యాలెస్ మైదానంలో సుస్థిర భవిష్యత్తుకోసం సీఎస్ఆర్, అనుబంధ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన వేమా సదస్సును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ న్యాయమూర్తి మాట్లా డుతూ రాజ్యాంగం 44వ సవరణలో పర్యావరణం జీవవైవిధ్యం కాపాడే అంశాలను చేర్చారన్నారు. సుప్రీంకోర్టులోనూ తీర్పు ఉందన్నారు. కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతతో వ్యవహరిం చాలన్నారు. వేదం, ఆగమ శాస్త్రాల విశ్లేషకులు వేమా సదస్సు ముఖ్యులు అగస్తి గురూజీ మాట్లాడుతూ సమాజంలో అభివృద్ధి ముఖ్యమని అందుకు ఆధ్యాత్మికత, చారిటీలు కీకలంగా ఉండా లన్నారు. వేమా ఒక సంస్థ కాదని, సమాజంలో మార్పు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికోసం పనిచేస్తోందన్నారు. వివిధ కార్పొరేట్ సంస్థల ముఖ్యులు పాల్గొన్నారు.

సేవాభావంతో చికిత్స అందించాలి

మహదేవపుర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్యులు సేవాభావంతో మెరుగైన వైద్యం అందించాలని మాజీ మంత్రి అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. మారతహళ్ళిలోని కావేరి ఆసుపత్రిలో కొత్త విభాగాన్ని లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ తల్లీబిడ్డల చికిత్సలకు ఆధునాతన వ్యవస్థలు ఉన్నాయంటూ అభినందించారు. ఆసుపత్రి కార్యనిర్వాహక డైరెక్టర్ డాక్టర్ భాస్కరన్ మాట్లాడుతూ 30 పడకల సామర్థ్యం కల్గిన ఆసుపత్రిలో రోబోటిక్ టెక్నాలజీ చికిత్సలు, ఆపరేషన్‌లు, పరీక్షలు, అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు మనోహరరెడ్డి, యమలూరు లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జమీర్ కుమారుడి సినిమా వివాదం

▸▸ డ్రోన్ ఆపరేటర్ ఆత్మహత్యాయత్నం

బెంగళూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మంత్రి జమీర్ అహ్మద్ కుమారుడు జహీద్‌ఖాన్ నటిస్తున్న కల్ట్ సినిమాకు అనిల్‌కుమార్ దర్శకత్వం వహించారు. సినిమా షూటింగ్‌కోసం సంతోష్ నుంచి డ్రోన్‌లు తీసుకున్నారు. ఈనెల 25న చిత్రదుర్గలో షూటింగ్‌వేళ విండ్ ఫ్యాన్‌కు తగలడంతో డ్రోన్ ముక్కలైంది. అందుకు సినిమా బృందం పరిహారం ఇవ్వలేదు. పలుమార్లు పరిహారం అడిగితే బెదరించడమే కాకుండా లక్ష రూపాయల విలువైన మెమరీకార్డును స్వాధీనం చేసుకుని వేధించారు. దీంతో సంతోష్ ఆత్మహత్యకు ప్రయత్నించి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. కాగా సినిమా బృందంపై కేసు నమోదు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వరకట్నం కేసులో
93 ఏళ్ల అవ్వకు ఉపశమనం

బెంగళూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరకట్నం కేసులో కలబురగి జైలులో శిక్ష అనుభవిస్తున్న 93ఏళ్ల అవ్వ నాగమ్మకు తాత్కాలిక ఉపశమనం లభించింది. 90రోజుల పెరోల్‌పై విడుదలయ్యారు. ఇటీవల ఉపలోకాయుక్త బీ వీరప్ప కలబురగి జైలును సందర్శించిన వేళ లేవలేనిస్థితిలో ఉన్న నాగమ్మను పరామర్శించి వివరాలు సేకరించిన విషయం తెలిసిందే. వరకట్నం కేసులో జీవిత ఖైదు శిక్షకు గురైనట్టు జైలు అధికారులు తెలిపారు. శౌచాలయానికి వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ఆమెకు జైలు సిబ్బంది, తోటివారు సాయం చేసేవారు. ఈమేరకు సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేయాలని ఉపలోకాయుక్త సూచించారు. మూడు నెలల పెరోల్ లభించగా జైలునుంచి అంబులెన్స్‌లో ఇంటికి పంపారు.

డీఎస్సీకి ఉచిత కోచింగ్

అనంతపురం అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పండ్ల తోట అమ్మకమునకు కలదు

తిరుపతి జిల్లా ఓజిల్ మండలం ఆర్మేనుపాడు గ్రామంలో 133 ఎకరముల పండ్లతోట అమ్మకమునకు కలదు. సంప్ర: **94401 83778**

AJN-193455

సైనికుడి ఇంటి ఎదుట
మహిళ నిరసన

▸▸ పెళ్లి చేసుకుని మోసగించాడని ఆరోపణ



అక్షయ్‌తో ప్రమోదా (ఫైల్)

బెంగళూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుడిలో పెళ్లి చేసుకుని.. మోసం చేశాడని ఆరోపిస్తూ ఓ సైనికుడి ఇంటి ముందు మహిళ నిరసన దీక్షకు దిగారు. బెళగావి జిల్లా బిజగర్ణి గ్రామానికి చెందిన అక్షయ్ నలవడతో మచ్చే గ్రామానికి చెందిన ప్రమోదా హజారాకు ఆరేళ్ల క్రితం ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ స్నేహం ప్రేమగా మారింది. అక్షయ్ నలవడ కంటే ఆమె 14ఏళ్ల పెద్దవారు. ఆరేళ్ల క్రితమే ఇంటి దేవుడి ఆలయంలో పెళ్లి చేసుకున్నామని పమోదా అన్నారు. ఆ తర్వాత మిలిటరీ విధుల నుంచి సెలవుపై వచ్చి తనతో 15రోజులు గడిపారని అన్నారు. అతడికి పలువురు మహిళలతో సంబంధం ఉన్నట్లు తనకు తెలిసిందని అన్నారు. ఇటీవల సెలవుపై వచ్చి మరో యువతితో నిశ్చితార్థం చేసుకున్నారని, ఈ విషయం తెలిసి న్యాయం చేయాలని ఆందోళన చేసేందుకు వెళితే.. న్యాయం చేస్తామని అక్షయ్ కుటుంబపెద్దలు హామీ ఇచ్చారని అన్నారు. కానీ అక్షయ్ పెళ్లి చేసుకోవడంతో నిరసనకు దిగానని తెలిపారు. అతని కుటుంబ సభ్యులు ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లిపోయారన్నారు. అయితే, తమకు పెళ్లి కాలేదని, కొన్ని రోజులు స్నేహంగా ఉన్నామని అక్షయ్ అంటున్నారు.

గజ ఈతగాడికి ఆత్మీయ సన్మానం



ఈశ్వర్‌మల్పెతో డ్రైవర్ల సంఘం నాయకులు

దొమ్మసంద్ర, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కారవార - కుమట మార్గంలో వర్షాకాలంలో అంకోలా తాలూకా గంగావళి నదీ తీరాన శిరూరుగుట్ట కూలిన సందర్భంలో 71 రోజుల తర్వాత అర్జున్ మృతదేహాన్ని వెలికితీసిని గజ ఈతగాడు ఈశ్వర్‌మల్పెను బెంగళూరు కసవనహళ్ళి కన్నడాంబె డ్రైవర్‌ల సంఘం ఆత్మీయంగా సత్కరించింది. సంఘం అధ్యక్షుడు యోగేశ్ జయరామ్, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ్‌ల నేతృత్వంలో బృందం బెంగళూరునుంచి వెళ్లి శుక్రవారం సత్కరించింది. ఈ సందర్భంగా యోగేశ్ మాట్లాడుతూ ఎంతోధైర్య సాహసాలతో నదిలో మృతదేహాన్ని శోధించి వెలికితీశారని అటువంటివారికి కన్నడ రాజ్యోత్సవ పురస్కారం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. సాధకులకు సముచిత గుర్తింపు కల్పించి ప్రోత్సహించాలన్నారు. భేటీ అయిన బృందంలో పదాధికారులు వెంకట్, సెందిల్, గంగాధర్, గణేశ్, రక్షిత్, మోహన్ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో విశేష పూజలు



వేంకటేశ్వర స్వామికి అలంకరణ

శిడ్లఘట్ట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం శనివారం పురస్కరించుకుని పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా పలు వెంకటేశ్వరస్వామి ఆలయాలలో విశేషపూజలు కొనసాగాయి. వాసవి రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేకపూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేకువజామున ఆలయశుద్ధి అనంతరం సుప్రభాతం, క్షీరాభిషేకం, తులసిమాల పుష్పాలతో అలంకరణ నిర్వహించారు. పట్టణంలోని ఫిలేచర్ క్వార్టర్స్‌లో మహాగణపతి, శనేశ్వరస్వామి, కల్యాణ వెంకటేశ్వరస్వామి, గాయత్రి దేవాలయంలోనూ ప్రత్యేక పూజలు కొనసాగాయి. బెళ్యాటిగేట్ సమీపాన నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ, తలకాయలబెట్టలోని పురాతన లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఒడిస్సెలో జిప్ పెట్టుబడులు

బెంగళూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ వెహికల్ బ్రాండ్‌లో ఒకటైన ఒడిస్సె సంస్థలో జిప్ ఎలక్ట్రిక్ పెట్టుబడులు పెట్టడంతో జాతీయస్థాయిలో విస్తరించేందుకు దోహదపడనుంది. వచ్చే మూడేళ్లలో 40వేల ఎలక్ట్రిక్ వాహనాలను ఉత్పత్తి చేసేందుకు వీలుకానుందని ఒడిస్సె ఎలక్ట్రిక్ సంస్థ సీఈఓ నెమిన్ ఓరా అభిప్రాయపడ్డారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు కూడా ఎలక్ట్రిక్ వాహనాలను చేర్చడమే లక్ష్యం కలిగామన్నారు. జిప్ ఎలక్ట్రిక్ కో ఫౌండర్ అండ్ సీఈఓ ఆకాశ్‌గుప్త మాట్లాడుతూ బ్రాండ్ విజన్‌తో పెట్టుబడులు పెట్టామన్నారు.

ఆంధ్రజ్యోతి

కార్ అండ్ బైక్ రేస్



నవంబర్ నెల కూపన్ నంబర్ - 3

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది నవంబర్ నెల మూడవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి నాలుగు నెలలు అయిన తర్వాత మొత్తం 12 కూపన్లను నాలుగు సెట్లుగా చేసి 2025 మార్చి నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా

ఆంధ్రజ్యోతి, 239-2ఏ, బైపాస్‌రోడ్, కక్కలపల్లి క్రాస్
అనంతపురం -515001
అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్: 9985411154
బ్రాంచ్ మేనేజర్: 9985411151



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.15	1594.66
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,302	508
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,984	8,542
నీటి నిల్వ (టీఎంసీలు)	94.63	15.36



బస్టాండ్ సమీపంలో చెత్తాచెదారం



మరమ్మతులకు నోచుకోక మూలనపడ్డ పైపులు

ఇక్కట్లలో ఇటిగి..!

- వారాల తరబడి మోటారు రిపేరీ
- తాగునీరందక గ్రామస్థులకు ఇక్కట్లు
- రోడ్లపైనే మురుగునీరు..
- అంటువ్యాధులతో జనం విలవిల

కంప్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రమవుతున్నా...అంటు వ్యాధులు ప్రబలుతున్నా అధికారుల్లో చలనం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరి నిర్లక్ష్యంతోనే గ్రామాభివృద్ధి కుంటు పడుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంప్లి తాలుకా పరిధిలోని సన్నాపురం గ్రామ పంచాయతీ పీడీఓ శేషగిరి ఇటిగి గ్రామంలో మోటారు ధ్వంసమై రోజులు గడుస్తున్నా ఇంతవరకు రిపేరీ చేయించలేదని గ్రామానికి చెందిన జక్కప్ప, వీరేష్, మారెమ్మ, హనుమంతమ్మ, ఉలిగమ్మ, తదితరులు పేర్కొన్నారు. గ్రామంలో రోజురోజుకీ నీటి సమస్య తీవ్రమవుతున్నా అధికారులు పట్టించు కోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధ్వంసమైన మోటర్‌కు ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదన్నారు. దీనికి తోడు వార్డుల్లో మురుగునీటి వల్ల ఇబ్బందులు పడుతున్నామని. బస్టాండు వద్ద ప్రధాన రోడ్డులో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం నిండి పోయి కాలనీవాసులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నా మన్నారు. కాలువలు లేక ఇళ్ల ముందు మురుగు నీరు నిల్వ వుండి దోమలు వ్యాపిస్తున్నాయన్నారు. గ్రామాల్లో డెంగీ, మలేరియా వ్యాపిస్తున్నాయని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు ఇటిగి గ్రామంపై దృష్టి పెట్టి, మౌళిక సదుపాయాలు, మోటరు మరమ్మతు చేపట్టాలని వారు కోరారు. లేకపోతే పంచాయతీ కార్యాలయం ముందు నిరసన చేపడ్తామని హెచ్చరించారు.



ధ్వంసమైన మోటారు



కోడి పిల్లలను అందజేస్తున్న జేఎస్‌డబ్ల్యూ సంస్థ సభ్యులు

గిరిరాజా కోళ్ల పంపిణీ

బళ్లారి సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో రాయచూర్ అగ్రికల్చరల్ యూనివర్శిటీ, హగరి వ్యవసాయ విజ్ఞాన కేంద్రం సహకారంతో సండూర్ తాలూకాలో 50మంది రైతులకు శనివారం గిరిరాజా కోడిపిల్లలను పంపిణీ చేశారు. రైతులకు సుమారు 450 గిరిరాజా జాతి కోళ్ళ పెంపకం కోసం తోరణగల్లు ఓపీజే సెంటర్‌లో మరిన్ని కోడిపిల్లలను అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ అధినేత పెద్దన్న మాట్లాడుతూ..... రానున్న రోజుల్లో సమగ్ర వ్యవసాయాభివృద్ధిలో భాగంగా రైతులకు గొర్రెల పెంపకం, పండ్ల చెట్లు , భూసార పరీక్షల కార్డు తదితర ప్రయోజనాలను అందిస్తామన్నారు. ఈసందర్భంగా వ్యవసాయ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. పాలయ్య, డాక్టర్ రవి, జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ అగ్రికల్చర్ విభాగం కోఆర్డినేటర్ నాగనగౌడ, ప్రగతిశీల రైతులు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో పేటే ఆంజనేయస్వామి

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పేటే ఆంజనేయస్వామికి కార్తీక మాసం చివరి శనివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో దీపాలు వెలిగించి భక్తులు పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్యామాచార్య స్వామివారికి వెండితో అలంకరణ చేశారు. అనంతరం పుష్పాలంకరణ, ఆకు పూజ, మహామంగళహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాద పంపిణీ నిర్వహించారు.

రోడ్ల నిర్మాణానికి నిధులివ్వండి : ఎంపీ

కంప్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బళ్లారి విజయనగర ఉభయ జిల్లాల్లో రోడ్ల నిర్మాణానికి సహకరించాలని ఎంపీ తుకారామ్ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితీష్ గడ్కరీని కోరారు. శనివారం ఢిల్లీలో గడ్కరీని కలిసిన ఎంపీ పలు డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. హంపీ నుంచి గుత్తి హైవే రోడ్డు పనులు వేగవంతంగా జరిగేలా నిధులు కేటాయించాలని, వేణి వీరాపురం నుంచి బళ్లారి వరకు రోడ్డు అభివృద్ధి పనులు జరపాలన్నారు. హోస్పేట నుంచి చిత్రదుర్గ రోడ్డును కూడా పలు చోట్ల ఫ్లైఓవర్ పనులు ప్రారంభించాలని కోరారు. త్వరలో డీపీఆర్ చేపట్టి పనులను పూర్తి చేసేలా రవాణాకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. పలు అభివృద్ధి పనులకు నిధులు కోరుతూ మనవిపత్రం అందించారు.



కేంద్రమంత్రి నితీష్ గడ్కరీతో ఎంపీ తుకారాం

గ్రామాల్లో సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

కంప్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఉప ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యే అన్నపూర్ణ శనివారం పలు గ్రామాల్లో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. ఉదయం కుడితిని పట్టణం చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కుడితిని, ఏళుబెంచి మాదాపురం, కొత్త దరోజీ, తిమ్మలాపురం గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షుడు వి రాజశేఖర్, వీరేంద్ర ప్రసాద్, బీసన్న, దొడ్డప్ప, అంజి, ఆన్‌లైన్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అన్నపూర్ణకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

మూఢనమ్మకాలను విడనాడాలి



జ్యోతివెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లెక్చరర్ శ్రీనివాసమూర్తి

బళ్లారి సిటీ, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలతో అమాయకులు బలవుతున్నారని, ఆధునిక కాలంలోనూ ఇలాంటి వాటిని ప్రోత్సహించడం విడ్డూరమని లెక్చరర్ శ్రీనివాస మూర్తి పేర్కొన్నారు. శనివారం కర్ణాటక స్టేట్ సైంటిఫిక్ రీసెర్చ్ కౌన్సిల్ జిల్లా విభాగం, వీరశైవ విద్యావర్ధక సంఘం సహకారంతో వుంకి మరిసిద్దమ్మ పాఠశాలలో నిర్వహించిన మిరాకిల్ సీక్రెట్ ఓపెన్ ప్రోగామ్‌లో ఆయన మాట్లాడారు. పిల్లల్లో శాస్త్రీయ ఆలోచన రావాలని, అందులో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. దోపిడీ దారులు అమాయకులకు లేనిపోని ఆశ చూపించి, దెయ్యాల పేరుతో భయాందోళన సృష్టిస్తున్నారన్నారు. అలాంటివారికి దూరంగా ఉండి, ప్రపంచాన్ని శాస్త్రీయ కోణంలో చూడాలన్నారు. సమస్యల సుడిగుండంలో కూరుకుపోయిన మనిషి మెదడు క్రియారహితంగా మారుతుందన్నారు. చేతులకు నిప్పంటించడం, విద్యార్థుల తలపై కర్పూరం వెలిగించడం, చేతుల రంగు మార్చడం తదితర అద్భుతాలు చేస్తారు. వీవీ సంఘం కార్యదర్శి డా.అరవిందపాటిల్ నూనెలేని నీళ్లలో దీపం వెలిగించారు. దనుర్వాతం రాగానే ఇనుప వస్తువు లేదా తాళం ఇస్తే క్షణక్షణం తగ్గుతుందని అయితే వైద్యం తప్పనిసరి అన్నారు. మూఢనమ్మకాలతో అమాయకులను మోసం చేసే నెట్‌వర్క్‌లను నిషేధించాలని అలాంటి వారిని శిక్షించాలన్నారు. ఈసందర్భంగా కార్పొరేషన్ సభ్యులు సురేఖ మల్లనగౌడ, మించేరి బసవరాజ్,వుంకి మరిసిద్దమ్మ స్కూల్ ప్రెసిడెంట్ శేఖర్, చన్నబసయ్య స్వామి, శివారెడ్డి, ప్రభు, శివానంద, రాజగురు, రమేశ్, కిత్తూరు రాణి చెన్నమ్మ, వుంకిమరి సిద్దమ్మ పాఠశాల, హీరదసూగమ్మ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మిర్చి పంట పరిశీలన



రైతుకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

బళ్లారి సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బళ్లారి, కురుగోడు, కంప్లి తాలూకాల్లో మిరప పంటను వ్యవసాయ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన శాస్త్రవేత్తలు మిర్చి పంటలో త్రిప్స్ పర్విస్పైనస్ తెగులు, బూడిద తెగులు, పండ్ల ముడత, ఆకుముడత లక్షణాలు కనిపిస్తున్నాయని హగరి వ్యవసాయ విజ్ఞాన కేంద్రంలోని వృక్షశాస్త్ర సీనియర్ శాస్త్రవేత్త డా.పాలయ్య , కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఆనంద్‌కుమార్ తెలిపారు. రత్నప్రియ హార్టికల్చర్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్, ఉద్యానవన శాఖ ప్రవీణ్ కుమార్ నాయక్ బృందం బళ్లారిరూరల్ పరిదిలోని కక్కబేవినహళ్ళి, శంకర బండె, ఇబ్రహీంపుర, రూపనగుడి తోపాటు చుట్టు ప్రక్కల గ్రామాల్లో పర్యటించి మిర్చి పంటకు తెగుళ్ళ వ్యాదుల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు సూచించారు.

ఉత్సాహంగా పోలీసు క్రీడలు



త్రోబాల్ ఆడుతున్న ఎస్ఐ శశిధర్

బళ్లారిరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : నగరంలో నిడీఆర్ గ్రౌండ్‌లో జరిగిన పోలీస్ క్రీడలు శనివారం ఘనంగా ముగిశాయి. గురువారం పోలీసు క్రీడలను ఐజీ లోకేష్ కుమార్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎస్పీ శోభారాణి ప్రారంభించారు. మూడు రోజులు పలు పోటీల్లో పోలీసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లో ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ నిత్యం ఒత్తిళ్లతో పని చేసే పోలీసులకు క్రీడలు ఎంతో ఉత్సాహాన్ని స్తాయన్నారు. పోలీసులు పలు పోటీల్లో విజేతలుగా నిలిచారని, వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూరు, అడిషనల్ ఎస్పీలు నవీన్ కుమార్, రవికుమార్, బళ్లారి జిల్లాలోని పోలీసు ఉన్నతాధికారులు, డీఎస్పీలు, సీఐ, ఎస్ఐలు పోలీసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న అధికారులు

బడ్జెట్‌పై ముందస్తు సమావేశం



మాట్లాడుతున్న మేయర్ ముల్లంగి నందీశ్

బళ్లారి సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహానగర కార్పొరేషన్ 2025-26 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రాధమిక సమావేశం మేయర్ ముల్లంగి నందీశ్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈసమావేశంలో అంద్రాళ్ సేవాసమితి నుండి వెంకటరెడ్డి పాల్గొని నగరంలో పలు సమస్యలపై సూచనలు చేశారు. గత మూడేళ్లలో 110 సమస్యలు లేవనెత్తగా వాటిలో కొన్ని మాత్రమే పరిష్కారమయ్యాయన్నారు. తాగునీరు, యూజీడీ సమస్య, రోడ్డు విస్తరణ, రోడ్ల గుంతల మూసివేత, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, విచ్చల విడిగా పశువులు, వీధి వ్యాపారుల సమస్యలపై మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈవిషయంపై మేయర్, కమిషనర్ మాట్లాడుతూ వచ్చే బడ్జెట్‌లో మీరు ఇచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈసందర్భంగా సామాజిక కార్యకర్తలు జయప్రకాశ్, రాణితోట విరూపాక్ష, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వేణుగోపాల్,పలు సంఘాల నాయకులు, ప్రజాప్రనిధులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

ఉపముఖ్యమంత్రి పర్యటనపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి) నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాను తమిళనాడు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిధిస్టాలిన్ పర్యటించనున్న తరుణంలో కలెక్టరేట్‌లో శనివారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కె.ఎం.సరయు అధ్యక్షత వహించి మాట్లాడతు ఉపముఖ్యమంత్రి డిసెంబరు 5న పర్యటనలో కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాలలో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ సహాయాన్ని అందజేసి కొత్త ప్రాజెక్టు పనులను శ్రీకారం చుట్టనున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణ సమావేశంల్లో ప్రభుత్వ శాఖల తరఫున జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పూర్తయిన పనులను శాఖల వారీగా పరిశీలిస్తారన్నారు. ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో అమలవుతున్న ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అదే విధంగా డీసీఎం పర్యటించే మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు సరిపడా ఆసనాలు, తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పి.తంగదురై, జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, హోసూరు కార్పొరేషన్ కమీషనర్ శ్రీకాంత్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రోగ్రామ్ డైరెక్టర్ పి.పెరియస్వామి, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక అధికారులు పాల్గొన్నారు.

నారేయణ తాతయ్య ఆశ్రమంలో వైభవంగా దీపోత్సవం

హోసూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీక అమావాస్యను పురస్కరించుకుని నగరంలోని కైవార నారేయణ తాతయ్య ఆశ్రమంలో శనివారం దీపోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు బ్రహ్మశ్రీ వెంకటేశ్వరస్వాములు తొలి దీపాన్ని ప్రజ్వలింపచేశారు. ఆ తర్వాత బ్రహ్మశ్రీ శ్రీనివాసరెడ్డి భక్తాదులతో కలిసి దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా భక్తుల భజనలు సాగాయి. భక్తులను ఉద్దేశించి వెంకటేశ్వరస్వామిజీ మాట్లాడుతూ కొన్నేళ్లుగా కార్తీక దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నామని భక్తులు ఉత్సాహంగా భక్తిశ్రద్ధలతో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. దీపాలు వెలిగించడం జ్ఞానసిద్ధికి మార్గమన్నారు. ప్రతి ఇంటా జ్ఞానసంపద పెరిగి పరమశివుని అనుగ్రహం లభించి సుఖసంతోషాలతో ఉండాలనే దీపోత్సవ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన స్టాండ్‌లలో దీపాలను వెలిగించారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



దీపోత్సవంలో వెంకటేశ్వరస్వాములు

ఆహార భద్రతా శాఖ అధికారుల తనిఖీలు

హోసూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిజిగ్నేటెడ్ అధికారి వెంకటేశం సలహా మేరకు హోసూరు ఆహారభద్రత అధికారి ముత్తుమారియప్పన్ నేతృత్వంలో కెలమంగలం ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రకాశ్, సంతోష్‌కుమార్, కావేరిపటణ్ణం అశ్విని, కెలమంగలం ఫుడ్ సేఫ్టీ అధికారులు కార్యాచరణలో పాల్గొన్నారు. కెలమంగలం బస్టాండు, మెయిన్ బజారు, పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న తినుబండారాలు, బేకరీలు, పానీపూరి దుకాణాలు, టీ దుకాణాలు, కిరాణా కొట్లు, మటన్, చికెన్ దుకాణాల షాపులను తనిఖీ చేశారు. టిఫిన్ సెంటర్‌లో ఇడ్లి, దోస పిండిలు కూడా పాడైపోయిన పిండిని నిల్వ ఉంచి ఉపయోగిస్తున్నట్టు గుర్తించారు. ఆహారాన్ని తయారు చేసే సరఫరా చేస్తున్న రెస్టారెంట్‌కు అధికారులు హెచ్చరికలు నోటీసు జారీ చేశారు. అలాగే కొన్ని బేకరీల నుంచి దాదాపు 6 కిలోల చెడిపోయిన చికెన్, చెడిపోయిన గుడ్లు, 4 కిల్లోల బ్రెడ్‌లు, 6 కిల్లోల కుళ్లపోయిన కూరగాయలను స్వాధీనం చేసుకున్నారు. రూ.12 వేలు జరిమానా విధించారు. పౌర ఆహార భద్రతా చట్టం నిబంధనలు ఉల్లంఘించినవారికి హెచ్చరికలు చేసినట్లు ముత్తుమారియప్పన్ తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మిపతి, హెల్త్ సూపర్‌వైజర్ శివగురునాథన్, మున్సిపాలిటీ శానిటేషన్ సూపర్‌వైజర్ నాగేంద్రన్ పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్నఅధికారులు

మాజీ ఎమ్మెల్యే దీక్ష విరమణ



వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు ప్రకటిస్తున్న తహసీల్దార్ విశ్వనాథ్

సిరుగుప్ప, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప చేపట్టిన నిరాహారదీక్ష శనివారం విరమించారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించడంతో ఆయన దీక్ష విరమిస్తున్నట్లు ప్రకటించారు. సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప నేతృత్వంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని, రైతులకు పంట నష్ట పరిహారం కల్పించాలని కోరుతూ నాలుగు రోజులుగా నిరాహార దీక్ష చేశారు. అందుకు తహసీల్దార్ విశ్వనాథ, ఆహార పౌరసరఫరాల డైరెక్టర్‌లు స్పందిస్తూ శనివారం నుంచి మార్కెట్ యార్డులో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిచామని ప్రకటించారు. దీంతో బీజేపీనాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేశారు.

సకాలంలో పన్ను చెల్లించండి : మేయర్

హోసూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని రామనాయకన లేక్ పార్కు సమీపాన కంప్యూటర్ సెంటర్‌లో పన్నుల వసూళ్ల శిబిరాన్ని మేయర్ సత్య ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలన్నారు. శిబిరంలో ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్ను, వ్యాపార పన్ను, పన్ను చెల్లింపుదారుల పేరు మార్పు, దుకాణం అద్దె, తాగునీటి బిల్లులకు సంబంధించి పరిష్కరించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ శ్రీకాంత్, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, జోనల్ ఛైర్మెన్ రవి, పన్నులస్థాయి సమితి ఛైర్మన్ చెన్నీరప్ప, కౌన్సిల్ సభ్యురాలు వరలక్ష్మి నరేశ్, సర్కిల్ సెక్రటరీ జాన్ ఎల్లప్ప, డీఎంకే మైనార్టీ సంక్షేమ విభాగం జిల్లా ఆర్గనైజర్ ఇక్రమ్‌అహ్మద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



పన్ను వసూలు శిబిరంలో మేయర్ సత్య , అధికారులు

యువతకు ఉచిత శిక్షణ

కదిరి అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వెబ్‌డెవలపర్ కోర్సులో యువతకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిక్రిష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, ఈ కోర్సు వ్యవధి మూడునెలలుంటుందని అన్నారు.

గులాబి పంటకు డౌనీ వైరస్



వైరస్ సోకిన గులాబీ మొక్కలు

హోసూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతం గులాబీ మొక్కలకు డౌనీ వైరస్ సోకడంతో దిగుబడి తగ్గి రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారు. సాధారణ పొలాల తోపాటు గ్రీన్‌హౌస్‌ల ద్వారా 2 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గులాబీ పువ్వులను సాగు చేస్తున్నారు. క్రిస్మస్, న్యూ ఇయర్, వాలెంటైన్స్‌డే, అనేక ఇతర పండుగలకు హోసూరు ప్రాంతం నుంచి విదేశాలకు గులాబీ పువ్వులు ఎగుమతి అవుతాయి. ప్రధానంగా వాలెంటైన్స్ డే వేడుకల కోసమే ఏటా కోటి గులాబీలను విదేశాలకు పంపుతారు. ప్రస్తుతం హోసూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో సాగు చేసే గులాబీ మొక్కలకు డౌనీ అనే వైరస్ సోకడంతో ఆకులు రాలిపోతూ పంట రావడం లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో 20 20 పూల గుత్తి రూ.150 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. ఈ తరుణంలో వ్యాధిసోకి పూల దిగుబడి తగ్గడంతో నష్టాలు చవిచూస్తున్నట్టు రైతులు వాపోతున్నారు. వైరస్ నియంత్రణకు ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన నోడల్ అధికారి

కంప్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లను నోడల్ అధికారి సిద్దరామేశ్వర ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం ఉదయం బైపాస్ పాఠశాల సమీపంలోని ఎస్సీఎస్టీ హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులు తమకు శీతాకాలంలో స్నానానికి చల్లనీరే ఇస్తున్నారని, మంచాలపై పరుపులు లేరని ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం బీసీఎం, హోస్పేట బైపాస్ బాలుర హాస్టల్, రామసాగర హాస్టల్‌ను మొత్తం ఏడు హాస్టళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో మంచాలు, బెడ్లు, నీటి సమస్య, విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక పంపి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. వారితో పాటు వార్డెన్లు విరుపాక్షి, కాలమ్మ, గురు, అరుణ్‌కుమార్, తదితరులు వున్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న నోడల్ అధికారి సిద్దరామేశ్వర